సాక్షి
ఒడిశా

బుధవారం। 15। మార్చి। 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం మంగళవారం లెక్కించారు. ఇందులో నగదు రూ. 3,05,143లు, బంగారం 820 మిల్లీ గ్రాములు వెండి 3 గ్రాముల 850 మిల్లీ గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



వైద్యుల నియామకాలు చేపట్టాలి

● మానవ అధికారి సురక్షా మంచ్ ఆందోళన

-8లో



అందరి కృషితో ఆదివాసీల అభివృద్ధి

● ఎస్‌డీసీ రాష్ట్ర శాఖ ముఖ్య సలహాదారుడు ప్రదీప్ మాఝి

-8లో

న్యూస్‌రీల్

క్షేత్రస్థాయి నుంచి ఆప్ బలోపేతం

● పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు నిశికాంత మహాపాత్రో



మాట్లాడుతున్న నిశికాంత మహాపాత్రో

జయపురం: ఒడిశా రాష్ట్రంలో ఆమ్ ఆద్మీ పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేస్తామని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు నిశికాంత మహాపాత్రో అన్నారు. మంగళవారం కొరాపుట్ జిల్లా సందర్శించిన సందర్భంగా జయనగర్ లేక్ ప్లాసిడ్‌లో విలేకరులతో మాట్లాడారు. ఆమ్ ఆద్మీ పార్టీలో ప్రతీ కార్యకర్త కేజ్రీవాల్ అడుగు జాడల్లో నడిచి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పలువురు బీజేపీ నేతలు, కార్యకర్తలు ఆప్‌లో చేరారు. పార్టీలో చేరినవారిలో బీజేపీ యువ మోర్చా కార్యవర్గ సభ్యుడు సంతోష్ మహాపాత్రో, నేతలు రాజ మిశ్ర, అరవింద రౌత్ తదితరులు ఉన్నారు. అనంతరం పార్టీ పటిష్టం చేసేందుకు 5గురు సభ్యులతో కూడిన కమిటీ ఏర్పాటు చేశారు. సమావేశంలో కొరాపుట్ జిల్లా ఆమ్ ఆద్మీ ప్రభారి సత్యజిత్ మహంతి, ప్రఫుల్ల ఖోస్ల, నారాయణ పాత్రో, అనిల్ పాత్రో, సంతోష్ మహాపాత్రో, ప్రదీప్ మహాపాత్రో తదితరులు పాల్గొన్నారు.

సత్తాచాటిన జయపురం వాసి

● వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో రెండు గోల్డ్ మెడల్స్



రెండు గోల్డ్ మెడల్స్ సాధించిన విశ్వనాథ్

జయపురం: నేపాల్ రాజధాని కాట్మాండ్‌లో జరిగిన అంతర్జాతీయ వెయిటలిఫ్టింగ్ పోటీల్లో జయపురానికి చెందిన విశ్వనాథ్ నాయిక్ భారత్‌దేశం నుంచి పాల్గొన్నారు. ఈయన రెండు కేటగిరీల్లో రెండు గోల్డ్ మెడల్స్ సాధించి చరిత్ర సృష్టించారు. ఈ పోటీలు ఈనెల 10వ తేదీ నుంచి 13వ తేదీ వరకు జరిగాయి. మొత్తం 9 దేశాల నుంచి సుమారు 500 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. గతంలో విశ్వనాథ్ అనేక పతకాలు సాధించారు. జాతీయ స్థాయిలో 9 బంగారు పతకాలు, 3 వెండి పతకాలు, రాష్ట్ర స్థాయిలో 19 బంగారు పతకాలు, 6 వెండి పతకాలు గెలుచుకున్నారు. అంతేకాకుండా గతేడాది విశ్వనాథ్, అతడి 11 ఏళ్ల కుమార్తె, కుమారుడు ఒక వెయిట్ లిఫ్టింగ్ పోటీలో పాల్గొని, ఒక్కొక్కరు ఒక్కొక్క బంగారు పతకాలను సాధించారు. దీంతో వారిని పలువురు అభినందిస్తున్నారు.


నదిలో మునిగి వ్యక్తి మృతి



మృతుడు భత్ర

రాయగడ: స్నానానికి వెళ్లిన ఒక వ్యక్తి నదిలో మునిగి మృతి చెందిన ఘటన జిల్లాలోని మునిగుడ సమితి లిడింగిపాదారా గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. మృతుడు నిషాన్‌బడి గ్రామానికి చెందిన డొంబురు భత్ర (51)గా పోలీసులు గుర్తించారు. సమీపంలోని వంశధార నదికి స్నానానికి వెళ్లిన భత్ర, ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన మనిగుడ పోలీసులు మంగళవారం లిడింగిపాదారా గ్రామ సమీపంలో మృతదేహాన్ని కనుగొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

'తపన్ సహూకు బీజేడీ నేతలతో సంబంధాలు'



ఫొటోలు చూపిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మల్కన్‌గిరి: జనసేవ కేంద్రంలో ప్రజల సొమ్మును పక్కదారి పట్టించి అరెస్టైన తపస్ సహూకు బీజేడీ నేతలతో సంబంధాలు ఉన్నాయని కాంగ్రెస్ పార్టీ మల్కన్‌గిరి జిల్లా అధ్యక్షుడు గోవింద పాత్రో ఆరోపించారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. చిత్రకొండ ఎమ్మెల్యే పూర్ణచంద్ర బక్క, బీజేడీ కార్యకర్త ప్రదీప్ మాఝిలతో తపస్‌కు సంబంధాలు ఉన్నాయన్నారు. ఈ కారణంతోనే గత పంచాయతీ ఎన్నికల్లో వారితో ఫొటోలు తీసుకున్నాడని విలేకరులకు చూపించారు. దీనిపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జి.శ్రీనివాస్‌రావు, పరుశురాం బోక్తో, ఇస్కాన ఖాస్ తదితరులు పాల్గొన్నారు. దీనిపై బీజేడీ నవరంగ్‌పూర్ ఎంపీ రమేష్ మాఝి స్పందించి బీజేడీపై అభియోగాలు మోపడం కాంగ్రెస్ పార్టీకి అలవాటే అన్నారు. ఫొటోలు తీసుకుంటే సంబంధాలు ఉన్నట్లు ఎలా అవుతుందని ప్రశ్నించారు.

తరతరణి వైభవం..

తరలిన భక్తజనం



విద్యుత్ కాంతుల్లో తరతరణి అమ్మవారి ఆలయం



అమ్మవారి దర్శనానికి బారులుతీరిన భక్తులు



కాళికా అవతారంలో భక్తులకు దర్శనమిస్తున్న తరతరణి అమ్మవారు



కొండపైకి వెళ్తున్న భక్తజన సందోహం



రోప్ వేలో కొండపైకి వెళ్తున్న భక్తులు



కొండపై భోగాలు పెడుతున్న పూజార్లు



తలనీలాలు సమర్పిస్తున్న భక్తులు

చైత్రమాసం మొదటి మంగళవారం సందర్భంగా దక్షిణ ఒడిశా ప్రజల ఆరాధ్య దైవం, రుశికుల్యా నదీతీరంలో ఎత్తైన కొండపై కొలువైన తరతరణి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలతో పాటు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నుంచి సుమారు 3 లక్షల మంది వరకు భక్తులు తరలివచ్చారు. ముడుపులు, తలనీలాలు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. కొండ దిగువున వంటావార్పులు చేసుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. తరతరణి అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి మధ్యాహ్నం రాజభోగం, సాయంత్రం సంధ్యా హారతి, రాత్రి బెడా చేపట్టి, ఉత్సవ దేవతలను ప్రత్యేక రథంలో తిరువీధి నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా గంజాం జిల్లా ఎస్పీ జగ్‌మోహన్ మీనన్ ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

– బరంపురం

మావో డంప్ స్వాధీనం



స్వాధీనం చేసుకున్న డంప్‌లో ఉన్న సామగ్రి



కూంబింగ్ నిర్వహిస్తున్న పోలీసులు

మల్కన్‌గిరి: జిల్లాలోని చిత్రకొండ సమితి స్వాభిమాన్ ఏరియా జోడాంబో 177 బెటాలియన్ బీఎస్‌ఎఫ్ జవాన్లు జంత్రీ పంచాయతీ పరిధి ఆర్లింగ్‌పాఢ్ గ్రామ అడవిలో మంగళవారం మావో డంప్ స్వాధీనం చేసుకున్నారు. వివర్లాలోకి వెళ్తే.. స్వాభిమాన్ ఏరియాలో జవాన్‌లు గిరిజనులకు రక్షణగా నిలుస్తూ, ప్రతీ గ్రామంలోనూ కూంబింగ్ నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా సోమవారం రాత్రి కూంబింగ్‌కు వెళ్లిన జవాన్‌లు, మంగళవారం ఉదయం తిరిగి వస్తున్న సమయంలో మావోలు అమర్చిన డంప్‌ను గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. డంప్ బయటకు తీయగా అందులో 7 జిలెటిన్ స్టిక్స్, 14 డిటోర్నేటార్స్, 20 మీటర్ల పొడవు ఉన్న కరెంట్ వైర్, ఏ సైజ్ బ్యాటరీలు 6, ఫ్లెక్సిబుల్ కరెంట్ వైరు 25 మీటర్లు, గోడుగు గుడ్డలో విరిగిన గాజు ముక్కలు, ఖాళీ టిఫిన్ బాక్స్ తదితర సామగ్రి ఉంది. ప్రస్తుతం ఇంకా ఎక్కడైనా డంప్‌లు పెట్టారేమోనని జవాన్లు జల్లెడ పడుతున్నారు.

హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలని నిరసన



ఎస్డీపీవో కార్యాలయం వద్ద ధర్నా చేపడుతున్న గ్రామస్తులు

రాయగడ:

జిల్లాలోని మునిగుడ సమితి హటొముని గుడ గ్రామంలో ఉన్న బాలికల ఆశ్రమ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలని ఆ గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం మునిగుడ ఎస్డీపీవో ఆకాష్ చంద్రసాహు కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. పాఠశాలలో చదువుతున్న ఆదివాసీ విద్యార్థినుల కోసం కొద్ది నెలల క్రితం 5టీ పథకంలో భాగంగా ప్రభుత్వం రూ.35 లక్షల నిధులు మంజూరు చేసింది. దీంతో నిధులు, ఖర్చులకు సంబంధించిన పూర్తి వివరాలు సమర్పించాలని పాఠశాల కమిటీ అధ్యక్షుడు ఆరక్షిత హికక హెచ్‌ఎం దేవేంద్ర పండను కోరారు. అయితే దీనికి హెచ్‌ఎం నిరాకరించడంతో పాటు అతనిపై దుర్భాషలాడడాన్ని నిరసిస్తూ ఆదివాసీ పరిషత్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. అనంతరం ఎస్డీపీవోకు ఫిర్యాదు చేశారు. దీనికి ఎస్డీపీవో సాహు స్పందించి సంఘటనపై దర్యాప్తు నిర్వహించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆదివాసీ పరిషత్ నాయకులు విష్ణు హికక, సురేష్ హికక, సారతీ హుయిక, జితు జకసిక, గోపి హుయిక, పాయికా జకక తదితరులు పాల్గొన్నారు.

● 'పరీక్ష' కాలం



రాష్ట్రంలో ప్రస్తుతం పరీక్షల సమయం నడుస్తోంది. మెట్రిక్యులేషన్, ప్లస్ 2 పరీక్షలు కొనసాగుతున్నాయి. దీంతో విద్యార్థులు పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. కానీ రాత్రి సమయంలో విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో దీపపు కాంతుల్లోనే చదువుకోవాల్సిన పరిస్థితి బొయిపరిగుడ సమితి కుశపార గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామంలో కొంతమంది కరెంట్ బిల్లు ఇంకా కట్టలేదని, మొత్తం గ్రామానికే విద్యుత్ సదుపాయాన్ని అధికారులు తొలగించారు. దీంతో గ్రామమంతా అంధకారం నెలకొని, దీపపు వెలుగుల్లోనే విద్యార్థులు పరీక్షలకు ప్రిపేర్ అయ్యారు. మరోవైపు గ్రామంలో కొవ్వొత్తులు సైతం లభించడం లేదని, నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న చికిమా గ్రామానికి వెళ్లి తీసుకొస్తున్నామని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులకు పరీక్షల్లో తక్కువ మార్కులొస్తే అధికారులే బాధ్యులవుతారన్నారు. సక్రమంగా బిల్లులు చెల్లిస్తున్నవారి ఇళ్లకు సైతం విద్యుత్ సరఫరా నిలిపివేయడం తగదన్నారు.

– జయపురం

భారీగా గంజాయి పట్టివేత

బరంపురం: కొందమాల్, గజపతి, గంజాం జిల్లాల సరిహద్దుల్లో అక్రమ గంజాయి రవాణా ఆగడం లేదు. రాష్ట్ర ఎక్సైజ్ కమిషనర్ ఆశిష్ కుమార్ సింగ్ ఆదేశాల మేరకు జిల్లా ఎక్సైజ్ అధికారులు మోహన నుంచి బరంపురం నగర శివారులోని పుకిడి బొందా 16వ నంబర్ జాతీయ రహదాపై ఒక కారులో తనిఖీలు నిర్వహించగా 70 కిలోల గంజాయి పట్టుబడింది. దీంతో కార్‌ను సీజ్‌చేసి, ఒకరిని అరెస్టు చేశారు. అరెస్టైన వ్యక్తి బీహార్ రాష్ట్రానికి చెందిన మహేంద్ర కుమార్‌గా ఎక్సైజ్ అధికారి గీతాంజలి సాహు తెలియజేశారు. అదేవిధంగా కొందమూల్-గంజా జిల్లా సరిహద్దు కళింగ ఘాటిపై ఫిరింగియా పోలీసులు ఆటోలో అక్రమంగా తరలిస్తున్న మరో 75 కిలోల గంజాయిని సీజ్ చేశారు. ఆటోతో పాటు ఒకరిని అరెస్టు చేసినట్లు ఏఎస్పీ సురేంద్ర కుమార్ పాత్రో వెల్లడించారు.



బరంపురం: సీజ్ చేసిన గంజాయితో పాటు అరెస్టు చేసిన వ్యక్తిని చూపిస్తున్న పోలీసులు



బరంపురం: అరెస్టు చేసిన నిందితుడితో ఫిరింగియా పోలీసులు

కానిస్టేబుల్ అరెస్టు

రాయగడ: గంజాయి కేసుకు సంబంధించి రాయగడ పోలీసులు ఎక్సైజ్ కానిస్టేబుల్‌ను అరెస్టు చేసిన ఘటన జిల్లాలో సంచలనం సృష్టించింది. సోమవారం రాత్రి చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక నెహ్రూనగర్‌లో నివాసముంటున్న ఎక్సైజ్ కానిస్టేబుల్ దీపక్ పాణిగ్రాహి ఇంట్లో గంజాయి ఉన్నట్లు సమాచారంతో స్థానిక పోలీసులు సోమవారం రాత్రి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో భాగంగా కానిస్టేబుల్ ఇంట్లో సుమారు 40 కిలోల గంజాయి పట్టుబడింది. దీంతో అతనిని అదుపులోకి తీసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి కోర్టుకు తరలించారు.



దీపక్ పాణిగ్రాహి (ఫైల్)

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి అంభపోదర్ గ్రామం వద్ద ఒక ప్రాంతంలో గంజాయి ఉన్నట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడులు నిర్వహించారు. ఆ సమయంలో అక్కడ ఎవరూ మనుషులు లేకపోవడంతో 4 క్వింటాళ్ల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు రూ.40 ఉంటుందని పోలీసులు వెల్లడించారు.



మల్కన్‌గిరి: పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి బస్తాలు

క్లుప్తంగా

నవమి వేడుకలకు సన్నాహాలు



సమాచార కేంద్రం వద్ద కమిటీ సభ్యులు

జయపురం: నగరంలో శ్రీరామ నవమి ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు కమిటీ నిర్ణయించింది. ఈ మేరకు మంగళవారం సన్నాహాక సమావేశాన్ని నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఒక సమాచార కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కంద్రవీధి కూడలి వద్ద ఏర్పాటు చేసిన సమాచార కేంద్రాన్ని సమాజ సేవి బినోదిని శాంతపాత్రో ప్రారంభించారు. ఊరేగింపునకు సంబంధించిన వివరాలను ఈ కేంద్రం నుంచి తెలుసుకోవచ్చని సూచించారు.

ధాన్యం కొనుగోలు చేయాలని ఆందోళన



రైతులతో మాట్లాడుతున్న సీఎస్‌వో ప్రఫుల్ల బెహరా

పర్లాకిమిడి: ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్ల కోసం ఇచ్చిన టోకెన్ల నిర్ణీత గడువు ముగుస్తున్నా అధికారులు మండీల వద్ద ధాన్యం తీసుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద మంగళవారం ఆందోళన చేశారు. గుసాని సమితి తంపరకవిటి రైతులు, జెడ్పీటీసీ, బీజేపీ నాయకులు ఆందోళన చేయడంతో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ప్రఫుల్ల బెహారా విచ్చేసి రైతు నాయకులతో మాట్లాడారు. తమ వద్ద మిగిలిపోయిన ధాన్యాన్ని తంపర కవిటి సొసైటీకి పంపించాల్సిందిగా కోరారు. దీంతో రైతులు ఆందోళనను విరమించారు.

గర్భిణిని ఆదుకున్న 108



అంబులెన్స్‌లో మగబిడ్డకు జన్మనిచ్చిన పావని

మందస: గిరిజన ప్రాంతాల్లో 108 అంబులెన్స్ సేవలు ఎంతగానో మేలు చేస్తున్నాయి. మందస మండలం హంసరాళి పంచాయతీ గిరిజన గ్రామమైన టుబ్బూరుకు చెందిన పి.పావని అనే గర్భిణికి పురిటినొప్పులు ప్రారంభమయ్యాయి. సమీపంలో ఆస్పత్రి లేకపోవడంతో 108 వాహనానికి సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న ఈఎంటీ శంకర్, పైలట్ మురళీమోహన్ హుటాహుటిన టుబ్బూరు చేరుకుని.. పావనిని అంబులెన్స్‌లో ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా, నొప్పులు అధికంగా కావడంతో మార్గమధ్యలో ప్రసవం చేయించారు. పావని, బిడ్డ క్షేమంగా ఉండడంతో పలాస ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు.

ఆదిత్య అధ్యాపకునికి సీవీ రామన్ అవార్డు



శాంతికుమార్‌ను అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్ నాగేశ్వరరావు

టెక్కలి: టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకుడు ఆర్.శాంతికుమార్‌కు కేరళ రాష్ట్రం నుంచి సి.వి.రామన్ అవార్డుకు ఎంపికైనట్లు కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు మంగళవారం తెలిపారు. కాస్మాలజీ, రిలేటివిటీ అంశాలపై శాంతికుమార్ చేసిన పరిశోధనలకు కేరళకు చెందిన ఇనిస్టిట్యూట్ ఆఫ్ రీసెర్చ్ సెంటర్ ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. శాంతికుమార్‌ను ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాస రావు, అధ్యాపకులు లక్ష్మణరావు, ప్రొఫెసర్ ఎం.రమణయ్య తదితరులు అభినందించారు.

బీఎస్పీ జిల్లా అధ్యక్షునిగా నారాయణరావు

టెక్కలి: బహుజన్ సమాజ్ వాదీ పార్టీ జిల్లా అధ్యక్షునిగా టెక్కలికి చెందిన బోకర నారాయణరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో రాష్ట్ర అధ్యక్షుడు పరంజ్యోతి ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర, జిల్లా పార్టీ నాయకులు నారాయణరావును అభినందించారు.

నరేంద్రకుమార్ మృతిపై విచారణ జరపాలి

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెంకు చెందిన దళిత యువకుడు లింగాల నరేంద్రకుమార్ మృతిపై విచారణ జరిపించాలని దళిత సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం చిలకపాలెంలోని మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం శ్రీకాకుళం డీఎస్పీ ఎం.మహేంద్రకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కంత వేణు, డి.రామప్పుడు, లింగాల గరికివాడు, సోమేశ్వరరావు పాల్గొన్నారు.

అందరి కృషితో ఆదివాసీల అభివృద్ధి



వేదికపై సరస్వతీ మాఝి, కలెక్టర్ సింగ్, ప్రదీప్ మాఝి, అనసూయ మాఝి



ఆదివాసీల సాంప్రదాయ నృత్యాలు

- ఎస్‌డీసీ రాష్ట్ర శాఖ ముఖ్య సలహాదారుడు ప్రదీప్ మాఝి

రాయగడ:

అందరి కృషితోనే ఆదివాసీల అభివృద్ధి సాధ్యమని స్పెషల్ డవలప్‌మెంట్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ ముఖ్య సలహాదారుడు ప్రదీప్ మాఝి అన్నారు. స్థానిక గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో ఐటీడీఏ ఆధ్వర్యంలో ఆదివాసీల సాంస్కృతిక వేదిక పేరిట మంగళవారం నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివాసీల భాష, కళలు, సంస్కృతిని పరిరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీల అభ్యున్నతికి మరిన్ని పథకాలను అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ప్రదర్శించిన సాంస్కృతిక నృత్యాలు అలరించాయి. ఆదివాసీల కోసం పోరాడుతున్న కొంతమంది నాయకులను సన్మానించారు. కార్యక్రమంలో కలెక్టర్ స్వాధాదేవ్ సింగ్, ఎస్‌డీసీ చైర్మన్ అనసూయ మాఝి, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి తదితరులు పాల్గొన్నారు.



ఆదివాసీ నాయకులను సన్మానిస్తున్న కలెక్టర్ సింగ్



కార్యక్రమానికి హాజరైన ఆదివాసీలు

అధ్యక్ష పదవికి ఆరుగురు పోటీ



అభ్యర్థుల పేర్లు ప్రకటిస్తున్న ఎన్నికల అధికారి అక్షయ్ కుమార్ పట్నాయక్

బరంపురం: ఈనెల 25వ తేదీన జరగనున్న గంజాం బార్ అసోసియేషన్ సంఘం ఎన్నికలు 2023–24లో అధ్యక్ష పదవికి ఆరుగురు సీనియర్ న్యాయవాదుల పోటీపడుతున్నారు. స్థానిక జిల్లా కోర్టు ప్రాంగణంలోని గంజాం బార్ న్యాయవాదుల సంఘం కార్యాలయంలో అభ్యర్థుల నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారి అక్షయ్ కుమార్ పట్నాయక్ మంగళవారం పరిశీలించి, పోటీలో ఉన్న అభ్యర్థుల పేర్లను ప్రకటించారు. అధ్యక్ష పదవికి సీనియర్ న్యాయవాది శివప్రసాద్ మిశ్రా, జగత్ మోహన్ పట్నాయక్, లక్ష్మీనారాయణ పాటి, మినతి రత్, రబింద్రే కుమార్ దేవ్, సుదాన్షు శేఖర్ పండా పోటీల్లో ఉన్నట్లు తెలిపారు. అదేవిధంగా ఉపాధ్యక్ష పదవికి దిలీప్‌కుమార్ పాత్రో, ఎం.చంద్రశేఖర్, కార్యదర్శి పదవికి అనిల్‌కుమార్ పండా, జ్యోతిప్రసాద్ చోత్రె, శిబనారాయణ సాహు, సుధీర్ కుమార్ మిశ్రా, టీ.వెంకటరావు, టిటు కుమార్ పాత్రో, సహాయ కార్యదర్శి పదవికి గిరిజా శంకర్ మిశ్రా, జె.శ్రీనివాస్, తపస్ కుమార్ సాహు పోటీ చేయనున్నట్లు వెల్లడించారు. ఆరోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బార్ సంఘం సభ్యులు తమ ఓటుహక్కు వినియోగించుకోవాలని అక్షయ్‌కుమార్ సూచించారు. సాయంత్రం 5 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభించి, అనంతరం విజేతలను ప్రకటించనున్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు



నుజ్జు నుజ్జయిన కారు

తగరపువలస: కారును లారీ ఢీకొన్న సంఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. సంగివలస వద్ద జాతీయ రహదారిపై మంగళవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. గార మండలం బూరవిల్లికి చెందిన మళ్ల రవికుమార్(42), మళ్ల అనూష(30), బొడ్డ లక్ష్మీప్రసన్న(38) విశాఖలో వివాహ కార్యక్రమానికి హాజరయ్యేందుకు కారులో బయలుదేరారు. సంగివలస వద్ద జాతీయ రహదారిపై వెనుక నుంచి వచ్చిన లారీ అదుపు తప్పి కారును ఢీకొని డివైడర్‌ను రాసుకుంటూ ఎడమవైపు రెయిలింగ్‌ను ఢీకొట్టి ముందు చక్రం ఊడటంతో ఆగిపోయింది. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జయింది. కారు స్టీరింగ్‌కు, సీటుకు మధ్య ఇరుక్కుపోయి రక్తమోడుతున్న రవికుమార్‌ను స్థానికులు అతి కష్టం మీద బయటకు తీశారు. కారులోని ఉన్న మిగిలిన ఇద్దరు క్షతగాత్రులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ముగ్గురిని ట్రాఫిక్ పోలీసుల సాయంతో స్థానికులు సంగివలస అనిల్ నీరుకొండ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం రవికుమార్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంది. భీమిలి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బూడిదే మిగిలింది!



ఫొటోస్టూడియోలో కాలిబూడిదైన వస్తువులు



దగ్ధమైన గాజుల షాపు

- ఇల్లు, ఫొటో స్టూడియో, బ్యాంగిల్ షాపు దగ్ధం
- రూ.40 లక్షల మేర ఆస్తి నష్టం

కాశీబుగ్గ: మున్సిపాలిటీ పరిధిలోని ఎంపీడీఓ కార్యాలయం రోడ్డులో మంగళవారం వేకువజామున జరిగిన అగ్ని ప్రమాదంలో ఇల్లు, ఫొటోస్టూడియో, బ్యాంగిల్ స్టోర్ దగ్ధమయ్యాయి. ఈ ఘటనలో సుమారు రూ.40 లక్షల మేర ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా వేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. బాడ ఈశ్వరవరప్రసాద్ ఇంట్లో మంగళవారం వేకువజామున 4 గంటల సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఏర్పడి మంటలు చెలరేగాయి. ఆ సమయంలో వాకింగ్‌కు వెళ్తున్న అగ్నిమాపక సిబ్బంది మంటలు, దట్టమైన పొగలు గుర్తించి వెంటనే ఫైరింజన్‌ను ఘటనా స్థలానికి తెప్పించారు. తలుపులు పగలగొట్టి లోపలికి వెళ్లి చూడగా ఎవరూ లేకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. అనంతరం మంటలు అదుపుచేశారు. అప్పటికే సామాన్లు కాలిబూడిదకాగా ఎదురుగా ఉన్న ఫోటో స్టూడియోకు మంటలు అంటుకున్నాయి. స్టూడియోలో ఉన్న రూ.3 లక్షల విలువైన కెమెరా, రూ.6 లక్షల విలువైన ట్విస్టర్ మిక్సర్, ఇతర సామగ్రితో పాటు పక్కనే ఉన్న బ్యాంగిల్ షాపు కాలిపోయింది. రెండు షాపులు, ఇల్లు కాలిపోవడంతో రూ.40 లక్షల వరకు ఆస్తినష్టం జరిగినట్లు అంచనా వేస్తున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఇంట్లో ఉన్న వారు సొంతగ్రామాలకు వెళ్లడంతో ప్రాణాపాయం తప్పిందని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు. ఎస్ఎఫ్ బి.సోమేశ్వరరావు ఆదేశాల మేరకు ఎల్ఎఫ్ కె.యుగంధర్, ఆపరేటర్ జి.ప్రేమ్‌కుమార్, హోంగార్డులు మంటలను అదుపు చేశారు. బాధితులకు సృష్టి ఐక్యతా ఫొటో, వీడియో అసోసియేషన్ సభ్యులు రూ.20 వేల సాయం అందించారు.

నేడు వైజయంతి ఉత్సవ వేదిక ప్రారంభోత్సవం

అరసవల్లి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు వీలుగా శ్రీవైజయంతి ఉత్సవ వేదిక సిద్ధమైంది. వసతి గదులు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలతో పాటు సుమారు వెయ్యి మంది ప్రేక్షకులు కూర్చునేలా స్థలం, విద్యుత్ అలంకరణకు వీలుగా వేదికను రూపొందించారు. జిల్లాలో ప్రముఖ కళాకారులతో ప్రత్యేక గోష్ఠి కార్యక్రమంతోనే వేదికను నేటి ఉదయం ప్రారంభించనున్నారు. ఈవో వి.హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు తగిన ఏర్పాట్లు చేశారు. కొన్నాళ్ల క్రితం ట్రైమాక్స్ పరిశ్రమ యాజమాన్యం నిర్మించిన ఈ వేదిక అసంపూర్తిగానే ఉండిపోయిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలో ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ బాధ్యత తీసుకుని నిర్మాణాన్ని పూర్తి చేయించారు. బుధవారం ఉదయం కళాకారుల గోష్ఠి నిర్వహించనున్న నేపథ్యంలో వేదిక ఏర్పాట్లను ప్రధానార్చకులు శంకరశర్మ, ఈవో హరిసూర్యప్రకాష్, నేతేటి హరిప్రసాద్‌శర్మలు పర్యవేక్షించారు.

కోలుకుంటున్న హాస్టల్ విద్యార్థులు

టెక్కలి రూరల్: మండలంలోని పోలవరం బీసీ బాలుర వసతి గృహానికి చెందిన 39 మంది విద్యార్థులు సోమవారం తీవ్ర అస్వస్థతకు గురై టెక్కలి జిల్లా ఆసుపత్రిలో చేరిన సంగతి తెలిసిందే. మంగళవారం 32 మంది విద్యార్థుల ఆరోగ్యం కుదుటపడటంతో ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. అయితే మంగళవారం కూడా మరో ఇద్దరు విద్యార్థులు కడుపులో నొప్పి, వాంతులు, విరోచనాలతో టెక్కలి జిల్లా ఆసుపత్రిలో చేరారు. ప్రస్తుతం ఆసుపత్రిలో తొమ్మిది మంది విద్యార్థులు చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.మీనాక్షి సోమవారం అర్ధరాత్రే టెక్కలి జిల్లా ఆసుపత్రిని సందర్శించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ఆరా తీశారు. అక్కడి నుంచి పోలవరం వెళ్లి మిగిలిన విద్యార్థులతో మాట్లాడారు. మంగళవారం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ లక్ష్మీతులసి, జిల్లా బీసీ సంక్షేమ శాఖాధికారి ఈ.అనురాధ, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి టి.త్రినాథరావులు ఆస్పత్రికి వచ్చి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఫుడ్ పాయిజనింగ్‌తో పాటు తాగునీరు కూడా కలుషితమై ఉండవచ్చని వైద్యులు, అధికారులు భావిస్తున్నారు.

విదేశీ మద్యం స్వాధీనం

పర్లాకిమిడి: పట్టణానికి 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న గారబంద రోడ్డులో అక్రమంగా రవాణా చేస్తున్న విదేశీ మద్యం (బీరు) సుమారు 103.5 లీటర్లను గురండి పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి ఎస్.చిరంజీవులు అనే వ్యక్తిని అరెస్టు చేశారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, జిల్లా కోర్టుకు తరలించారు.

గ్రామంలోకి మచ్చల జింక



గాయపడిన జింక

మల్కన్‌గిరి: జిల్లాలోని మత్తిలి సమితి కెందుగూఢ గ్రామానికి చెందిన ఒక ఇంటిలోకి మంగళవారం మచ్చల జింక వచ్చింది. దీంతో ఇంటి యజమాని మత్తిలి అటవీ శాఖ రేంజర్ వాసుదేవ్ నాయిక్‌కు సమాచారం అందించారు. ఆయన తన సిబ్బందితో గ్రామానికి చేరుకొని జింకను స్వాధీనం చేసుకున్నారు. జింకకు గాయమవ్వడంతో వైద్యం చేయించి, కోలుకున్న తర్వాత అడవిలోకి విడిచిపెడతామని అధికారులు తెలియజేశారు.

భద్రతా ప్రమాణాలు కీలకం



మాట్లాడుతున్న జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శివశంకరరెడ్డి

ఎచ్చెర్ల క్యాంపస్: పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు కీలకమని జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జె.శివశంకరరెడ్డి అన్నారు. ఎచ్చెర్ల మండలం అరిణాం అక్కివలసలోని నాగార్జునా అగ్రికెం పరిశ్రమలో మంగళవారం జాతీయ భద్రత వారోత్సవాల్లో భాగంగా భద్రతా పరికరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమలో పనిచేసేవారికి పటిష్ట భద్రత అవసరమని చెప్పారు. ఎన్ఏసీఎస్ ఉత్తమ భద్రత ప్రమాణాల్లో కాన్ఫిడరేషన్ ఆఫ్ ఇండియాన్ ఇండస్ట్రీ గుర్తింపు లభించిందని, మెరుగైన ప్రమాణాలతో పరిశ్రమలు ప్రగతి సాధిస్తాయని తెలిపారు. డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ పీవీఎస్ నారాయణ మాట్లాడుతూ ఉద్యోగులు, కార్మికులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. చిన్నపాటి నిర్లక్ష్యం సైతం ఒక్కోసారి సమస్యగా మారుతుందన్నారు. పరిశ్రమ ఉపాధ్యక్షుడు కె.శేషగిరిరావు మాట్లాడుతూ పరిశ్రమలో భద్రతకు ప్రాధాన్యమిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పరిశ్రమ అధికారులు కె.శ్యాంప్రసాద్, పీఎస్‌వీఎస్‌వీఎస్ వర్మ, వి.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల నియామకాలు చేపట్టాలి



ఆందోళన నిర్వహిస్తున్న మానవ అధికారి శురక్షా మంచ్ ప్రతినిధులు

- మానవ అధికారి సురక్షా మంచ్ ఆందోళన

బరంపురం: దక్షిణ ఒడిశా ప్రజలకు వైద్య సేవలందించే ఎంకేసీజీలో స్పెషలిస్ట్ వైద్యుల నియామకాలు చేపట్టాలని మానవ అధికారి సురక్షా మంచ్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు ఆస్పత్రి సూపరింటెండెంట్ కార్యాలయం వద్ద మంగళవారం ఆందోళన నిర్వహించారు. మంచ్ కన్వీనర్ అబని కుమార్ గయా మాట్లాడుతూ.. వైద్యుల కొరత ఉండడంతో ఆస్పత్రికి వచ్చిన రోగులకు నామమాత్రపు సేవలే అందుతున్నాయన్నారు. దూర ప్రాంతాల నుంచి వైద్యం కోసం వచ్చేవారికి వ్యయప్రయాసలే మిగులుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆస్పత్రిలో ఎండోక్రైనాలజీ, యూరాలజీ, నెఫ్రాలజీ, గైనకాలజీ, కార్డియాలజీ, న్యూరోసర్జరీ, కార్డియోథెరిపీ వైద్య విభాగాలకు సూపర్ స్పెషాలిటీ విభాగాలు ఉన్నాయి. అయితే నిబంధనల ప్రకారం ఒక్కో విభాగంలో ప్రొఫెసర్, అసోసియేట్‌తో సహా ఆరుగురు వైద్యులు ఉండాలి. కానీ ప్రస్తుతం ఒక్క వైద్యునితో మాత్రమే పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. నెఫ్రాలజీ విభాగంలో ఉన్న ఒక్క వైద్యుడికి కూడా ఇటీవల బదిలీ అయినా, మరో వైద్యుడు రాకపోవడంతో రెండుచోట్లా ఆయనే కొనసాగుతున్నారని తెలియజేశారు. అలాగే ఎండో క్రైనాలజీ విభాగానికి చెందిన ఒకే ఒక వైద్యుడు దీర్ఘకాలంగా సెలవు మీద వెళ్లారన్నారు. ప్రస్తుతం ఈ విభాగాన్ని మెడిసిన్ విభాగం వైద్యుడు పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. యూరాలజీ విభాగంలో ఒకే వైద్యుడు ఉన్నా, ఆయన ఎక్కువగా కటక్ ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఉంటూ వారానికి ఒక్కసారే వస్తున్నట్లు రోగులు ఆరోపిస్తున్నారన్నారు. గైనాలజీ వైద్యులు ప్రైవేట్ క్లీనిక్‌లలో ఎక్కువ సమయం గడుపుతుండడంతో రోగులకు సకాలంలో వైద్యం అందడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఎంకేసీజీ ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు.




ఆస్కార్ వచ్చిన వేళ..!

తెలుగు సినిమా ఆర్‌ఆర్‌ఆర్‌లో 'నాటు నాటు' పాటకు ఆస్కార్ అవార్డు దక్కిన నేపథ్యంలో దేశవ్యాప్తంగా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. మంగళవారం కవిటి మండలం కొత్తకొజ్జీరియా ఉన్నత పాఠశాలలో చిత్రంలోని కొన్ని కీలక సన్నివేశాల్ని చిన్నారులు ఆసక్తికరంగా ప్రదర్శించారు. ఉపాధ్యాయులు మురపాల జగన్నాథం, నిరంజన్ ఖడంగా, చలపతిరావు తదితరులు చిన్నారుల నైపుణ్యాన్ని ప్రశంసించారు.

– కవిటి

చైతన్యంతోనే మోసాలకు అడ్డుకట్ట

- వస్తువు నాణ్యతలో తేడాలుంటే ఫిర్యాదు చేయాలంటున్న నిపుణులు
- నేడు వినియోగదారుల దినోత్సవం



శ్రీకాకుళం పాతబస్టాండ్: నిత్యజీవితంలో వినియోగించే ప్రతి వస్తువు నాణ్యతగా ఉండాలని కోరుకుంటాం. ఈ విషయంలో ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నా ఒక్కోసారి మోసపోతునే ఉంటాం. వస్తుమార్పిడి నుంచి వస్తు కొనుగోలు వరకు తరాలు మారినా కొందరు వ్యాపారులు, ఉత్పత్తిదారులు వినియోగదారులను ఏదో ఒక రకంగా మోసం చేస్తునే ఉన్నారు. వినియోగదారులకు పెట్టిన సొమ్ముకు సరిపడా నాణ్యమైన వస్తువులు దొరకని పరిస్థితి.

ఉత్పత్తిదారులు, అమ్మకందారుల మోసాల నుంచి వినియోగదారులు బయటపడాలంటే ఆ మోసాలను గుర్తించడం, వాటిపై ఫిర్యాదు చేయాల్సిన అవసరం ఉంది.

☛ వినియోగదారులు చైతన్యవంతమైనప్పుడే మోసాల నుంచి బయటపడతాం. అందుకు ప్రభుత్వం పలు చట్టాలను తీసుకొచ్చింది. వినియోగదారుల దినోత్సవం పేరిట ఏటా అవగాహన కార్యక్రమాలు చేపడుతోంది. 1986లో కేంద్ర ప్రభుత్వం వినియోగదారుల పరిరక్షణ చట్టాన్ని తీసుకువచ్చింది.

☛ మనం ఉదయం నుంచి సాయంత్రం వరకు వాడే పరికరాలు, ఆహారంలో నాసిరకమైనవి, కల్తీవి కోకొల్లలు. పెట్రోల్, డీజిల్, కిరోసిన్, గ్యాస్, తూనికలు, కొలతలు, ఏటీఎం మోసాలు, బ్యాంకులు, ఎలక్ట్రానిక్ పరికరాలు, వస్తువులు, పానియాలు, పదార్థాలు.. ఇలా ఒకటేంటి అన్ని రకాల వస్తువుల కొనుగోలు సమయంలో తరచూ మోసపోతుంటాం. వీటిని అధిగమించాలంటే అవగాహన చట్టాలు తెలుసుకోవడం అవసరం. మోసానికి గురైనట్లు భావిస్తే ఎవరిని ఆశ్రయించి ఫిర్యాదు చేయాలనే విషం తెలుసుండాలి. వీటి కోసం వినియోగదారుల ఫోరం, సంస్థలు, ప్రత్యేక న్యాయస్థానాలు అందుబాటులో ఉన్నాయి. వీటిని ఆశ్రయించి మోసాల నుంచి రక్షణ పొందాలి. మోసపోయిన సొమ్మును తిరిగి రాబట్టుకోవచ్చు.

నేడు కలెక్టరేట్‌లో..

జాతీయ వినియోగదారులు దినోత్సవం బుధవారం జరగనుంది. కలెక్టరేట్‌లో ఉదయం జరిగే ఈ సమావేశానికి వినియోగదారులు, అధికారులు పాల్గొంటారు.

కొత్తరం మోసాలతో జాగ్రత్త..



ఇప్పటి వరకు జరిగిన మోసాలు ఒక రకమైతే.. ప్రస్తుతం టెక్నాలజీతో మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాలు ఇటీవల పెరిగిపోయాయి. వీటిని అధిగమించేందుకు ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలి.

– బగాది రామ్మోహన్‌రావు, వినియోగదారుల సంఘాల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు

క్లుప్తంగా

బైక్ మెకానిక్ షాప్ దగ్ధం


అగ్నికి ఆహుతవుతున్న బైక్ మెకానిక్ షాప్

విజయనగరం క్రైమ్: స్థానిక తోటపాలెం సత్య డిగ్రీ కళాశాల సమీపంలో ఉన్న రాపాక కృష్ణ బైక్ మెకానిక్ షాప్ సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత అగ్నికి ఆహుతైంది. ఈ ప్రమాదంలో షాప్ బయట ఉన్న మొత్తం బైక్‌లన్నీ పూర్తిగా కాలిపోయాయి. సుమారు రూ.ఐదారు లక్షలకు పైగా ఆస్తినష్టం సంభవించి ఉంటుందని ఏడీఎఫ్ఓ సోమేశ్వరరావు తెలిపారు. అర్ధరాత్రి 1 గంట ప్రాంతంలో వచ్చిన సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చామన్నారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణమై ఉండవచ్చని అనుమానిస్తున్నట్లు చెప్పారు.

తాగునీటి కుళాయి ఏర్పాటుపై వివాదం

- ఇరు వర్గాలకు చెందిన 10 మందిపై కేసు నమోదు

లక్కవరపుకోట: మండలంలోని మల్లివీడు గ్రామంలో రక్షిత మంచినీటి ట్యాంక్‌నుంచి ఏర్పాటు చేస్తున్న వీధి కుళాయిల నిర్మాణంలో తలెత్తిన వివాదంలో ఇరు వర్గాలకు చెందిన 10 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ముకుందరావు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామంలో బూసాల సూరిబాబు ఇంటి సమీపంలో ఏర్పాటు చేస్తున్న వీధి కుళాయి నిర్మాణంలో రెండు కుటుంబాల మధ్య వాదోప వాదాలు జరిగాయి. ఆ సమయంలో పెదిరెడ్ల లక్ష్మి కుటుంబానికి చెందిన నలుగురు వ్యక్తులు దాడి చేసి గాయపరిచారని సూరిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసారు, అలాగే సూరిబాబు కుటుంబసభ్యులు తమ ఇంటిపై దాడి చేసి గాయపరిచారని లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సూరిబాబు కుటుంబానికి చెందిన ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ

- బొబ్బిలి విద్యార్థులకు పతకాలు

బొబ్బిలి: ఈనెల 10వ తేదీ నుంచి మూడు రోజుల పాటు యలమంచిలిలో జరిగిన రాష్ట్రస్థాయి అంతర్ జిల్లా తైక్వాండో చాంపియన్ షిప్ పోటీల్లో బొబ్బిలి పట్టణ క్రీడాకారులు ప్రతిభ చూపి పతకాలు సాధించినట్లు కోచ్ బంకురు ప్రసాద్ మంగళవారం తెలిపారు. పట్టణ విద్యార్థుల్లో చరిత, యశస్విని, బంగారు పతకాలు, ఆదిత్య, శివరామకృష్ణ, తన్మయి, జాజిలి, జాహ్నవి, సంజన రజత పతకాలు, గౌతమి, సుశాన్ని, వరలక్ష్మి, దర్శత్‌లు కాంస్య పతకాలు సాధించినట్లు వివరించారు.

యువకుడికి తీవ్రగాయాలు


ఘటనాస్థలిలో తీవ్రగాయాలతో తేజేశ్వరరావు

బొబ్బిలి రూరల్: మండలంలోని దిబ్బగుడ్డివలస సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మక్కువకు చెందిన దొడ్ల తేజేశ్వరరావు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మక్కువ నుంచి బొబ్బిలివైపు ద్విచక్రవాహనంపై తేజేశ్వరరావు వస్తుండగా, బొబ్బిలి నుంచి మక్కువవైపు వెళ్తున్న ట్రాక్టర్ దిబ్బగుడ్డివలస-గోపాలరాయుడిపేట మధ్యలో దిబ్బగుడ్డివలస సమీపంలో ఢీకొనడంతో యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన యువకుడిని, ద్విచక్ర వాహనాన్ని 50మీటర్లపైగా ట్రాక్టర్ ఈడ్చుకుపోయింది. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు 108వాహనానికి సమాచారం ఇవ్వగా, సిబ్బంది వచ్చి బొబ్బిలి సీహెచ్‌సీకి తరలించారు. క్షతగాత్రుడికి ప్రథమచికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయనగరం తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాఫ్ట్‌బాల్ పోటీల్లో 'విజయ'ఖేతనం


విజేతలను అభినందిస్తున్న పీడీ సత్యనారాయణ

బొబ్బిలి రూరల్: అనంతపురం ఆర్డీటీ స్టేడియంలో ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు నిర్వహించిన ఇంటర్‌జోనల్ సీనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లాకు చెందిన సీహెచ్ సుభాషిణి, ఎం.లావణ్య, బి.సాయితులసిలు ప్రతిభ చూపారు. జట్టును విజేతగా నిలిపారు. అంతకుముందు ఈ నెల 3 నుంచి 5 వరకు తమిళనాడు తిరుచ్చిలో జరిగిన సీనియర్ సౌత్ జోన్ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లోనూ ఏపీ బాలికల జట్టు ద్వితీయస్థానంలో నిలిచింది. జట్టు విజయంలో కీలకపాత్ర పోషించిన జిల్లా క్రీడాకారిణులను పారాది పీడీ సత్యనారాయణ, జిల్లా క్రీడాధికారులు అభినందించారు.

ఆక్రమణల్లోగుట్టు అధికారులకే ఎరుక

- కబ్జాకోరల్లో ఎరుకువాని చెరువు
- 8 ఎకరాలు కబ్జాచేస్తున్న వ్యాపారి
- లక్షల్లో రియల్ ఎస్టేట్ లావాదేవీలు
- గ్రామస్తులు ఫిర్యాదుచేసినా చర్యలు శూన్యం


ఆక్రమణలకు గురైన ఎరుకువానిచెరువు

రాజాం: ఆ చెరువు రియల్ ఎస్టేట్ అక్రమ వ్యాపారానికి అడ్డాగా నిలుస్తూ వ్యాపారికి ఆర్థిక పరిపుష్టి తెచ్చిపెడుతోంది. ఇంకేముంది తొలుత ఒక ఇంటి నిర్మాణం నిమిత్తం చెరువు పక్కన కొనుగోలుచేసిన స్థలం పక్కనే చెరువును కబ్జాచేసిన ఆక్రమణదారు, అనంతరం తన ఇంటి పక్కన వరుసగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేందుకు చెరువును ఇండ్లస్థలాలుగా మార్చి విక్రయాలు మొదలు పెట్టేశాడు.

ఎనిమిది ఎకరాల నుంచి 80 సెంట్లకు

రాజాం మండలపరిధి అంతకాపల్లి పంచాయతీలో సర్వే నంబర్ 1లో ఎరుకవాని చెరువు ఉంది. ప్రభుత్వ గ్రామ అడంగల్‌లో ఈ చెరువు 8 ఎకరాలుగా నమోదైంది. అయితే ప్రస్తుతం ఆ చెరువు విస్తీర్ణం 80 సెంట్లు కూడా లేని దుస్థితి ఉంది. రాజాం పట్టణాన్ని ఆనుకుని శ్రీకాకుళం రోడ్డులో శ్రీ చైతన్య స్కూల్ ఎదురుగా ప్రధాన రహదారి పక్కనే ఈ చెరువు ఉంది. గతంలో రాజాం పట్టణానికి చెందిన ఓ వ్యాపారి ఇక్కడ చెరువు పక్కన రియల్ వ్యాపారి వద్ద చిన్నపాటి స్థలం కొనుగోలుచేశాడు. అనంతరం చెరువును కబ్జాచేసి అక్కడ పెద్ద భవంతిని నిర్మించాడు. ఎవరూ పట్టించుకోవడంలేదని తెలుసుకుని చెరువు మొత్తం కబ్జాచేస్తూ రియల్ వ్యాపారం చేసేందుకు స్థలాలుగా విభజించి విక్రయాలు చేస్తున్నాడు.

ఫిర్యాదుచేసినా..ఫలితం శూన్యం

చెరువు ఆక్రమణలకు పాల్పడుతున్న వ్యాపారి రాజాం పట్టణంలో ఫ్రిజ్‌లు, టీవీలు, బెడ్‌షీట్‌లు, చేతిగడియారాల షోరూమ్ నడుపుతున్నాడు. అయితే తాను ఆక్రమించిన చెరువులో స్థలాల వ్యాపారం ఆయనకు బాగా కలిసివస్తోంది. ఒక్కో సైట్‌ను రూ.4 లక్షల వరకూ విక్రయిస్తున్నాడు. ఈ విషయాన్ని గమనించిన అంతకాపల్లి పంచాయతీ మొగిలివలస గ్రామానికి చెందిన మజ్జి హరనాథరావుతో పాటు మరికొంత మంది రైతులు నాలుగు నెలల క్రితం విజయనగరం కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదుచేశారు. దీంతో ఆ వ్యాపారి తాను నిర్మించిన ఇంటిని వేరే వ్యక్తికి విక్రయించినట్లు బినామీ పేరున ఇంటిని రిజిస్ట్రేషన్ చేయించి రెవెన్యూ అధికారుల కళ్లుగప్పి తప్పించుకునే ప్రయత్నాలు చేశాడు. ఇంటిని, చెరువును పరిశీలించిన రాజాం రెవెన్యూ అధికారులు ఇంటి నిర్మాణం చెరువులో ఉందని, ఎరుకవాని చెరువు ఆక్రమణకు గురైనట్లు గుర్తించారు. ఆక్రమణల్లో ఉన్న ఇంటిబాగాన్ని తొలగించనున్నట్లు నోటీసులు కూడా జారీచేశారు. ఆ ఇల్లు తన పరిధిలో లేదని తప్పించుకున్న వ్యాపారి తాజాగా ఆ ఇంటిపక్కన చెరువును కబ్జాచేసి రియల్ వ్యాపారం మొదలు పెట్టేశాడు. ఫలితంగా చెరువు కుచించుకు పోయింది. చెరువుఆయకట్టులో పంటపొలాలకు నీరు అందని పరిస్థితి నెలకొనడంతో సుమారు 30 ఎకరాల్లో ఈ ఏడాది పంటలు కూడా సాగుచేయలేదు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు దృష్టిసారించి ఆక్రమణలు అడ్డుకోవాలని అంతకాపల్లి పంచాయతీ ప్రజలు, చెరువు ఆయకట్టు రైతులు కోరుతున్నారు.


చెరువుగర్భం కప్పేసి వేస్తున్న ప్లాట్లు

ఆక్రమణలు వాస్తవమే



అంతకాపల్లి పంచాయతీ పరిధిలో రాజాం పట్టణాన్ని ఆనుకుని ఉన్న ఎరుకువాని చెరువు ఆక్రమణలు వాస్తవమే. రాజాం పట్టణానికి చెందిన వ్యాపారి వై.శ్రీనివాసరావు ఈ చెరువును ఆక్రమిస్తున్నట్లు గతంలో ఫిర్యాదు వచ్చింది. ఈమేరకు సర్వేచేసి వ్యాపారి ఇంటి నిర్మాణంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలు చెరువు గర్భానికి చెందినవిగా గుర్తించి నోటీసులు ఇచ్చాం. ప్రస్తుతం రియల్ వ్యాపారం జరుగుతున్నట్లు మాదృష్టికి రాలేదు. ఇప్పుడు సర్వేయర్లను పంపించి ఆక్రమణలకు పాల్పడిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

పి.విజయ్‌భాస్కర్, తహశీల్దార్, రాజాం

వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్త



- ఎల్‌నినో కారణంగా అధిక ఉష్ణోగ్రతలు
- కలెక్టర్ ఎ.సూర్య కుమారి



విజయనగరం అర్బన్: కొద్ది రోజులుగా ఎండ తీవ్రత పెరుగుతున్న కారణంగా వడగాలుల పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఒక ప్రకటనలో కోరారు. ఎల్‌నినో కారణంగా అధిక ఉష్ణోగ్రతలు, పొడిగాలులు వీచే ఆస్కారం ఉందన్న వాతావరణ శాస్త్రవేత్తల సూచనలను బట్టి ప్రతిఒక్కరూ, వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఎండ వేడిమి ఉన్న సమయాల్లో వీలైనంతవరకూ బయటకు రాకుండా ఉండాలని, తప్పనిసరి పరిస్థితిల్లో రావాల్సి వస్తే తగిన జాగ్రత్తలను తీసుకోవాలని సూచించారు. ఈ వేసవిలో లూజుగా ఉన్న కాటన్ దుస్తులు, తెలుపు రంగు దుస్తులను ధరించడం శ్రేయస్కరమని పేర్కొన్నారు. ముఖ్యంగా గర్భిణులు, వృద్ధులు, చిన్నపిల్లల పట్ల మరింత అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. జిల్లావ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రమాదవశాత్తు ఎవరైనా వడదెబ్బకు గురైతే, తక్షణం చికిత్సను అందించేందుకు అవసరమైన మందులను ప్రభుత్వ ఆస్పత్రుల్లో సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు.

వడదెబ్బ అంటే ఏంటి..?:

ఎండ తీవ్రత వల్ల శరీర ఉష్ణోగ్రత ఒక్కసారిగా 104.9 డిగ్రీల వరకు పెరిగిపోయి, దానిని నియంత్రించే శక్తిని శరీరం కోల్పోవడమే వడదెబ్బగా పరిగణిస్తారు. నిర్లక్ష్యం చేస్తే అది ప్రాణాంతకమవుతుంది.

వడదెబ్బ లక్షణాలు:

శరీర ఉష్ణోగ్రత ఎక్కువగా ఉండడం, వణుకు పుట్టడం, మగత నిద్ర కలవరింతలు, తలనొప్పి, తల తిరగడం, ఫిట్స్, పాక్షికంగా లేదా పూర్తిగా అపస్మారక స్థితి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

వర్షైనా వడదెబ్బకు గురైతే వారిని నీడలో ఉంచి, చల్లని గాలి తగిలేలా చేయాలి

తడిగుడ్డతో తుడిచి శరీరాన్ని చల్లబరిచేందుకు ప్రయత్నించాలి

ఉప్పు కలిపిన మజ్జిగను, గ్లూకోజ్, ఓఆర్ఎస్ లాంటి ద్రవ పదార్థాలను ఇవ్వాలి

వడదెబ్బకు గురై, అపస్మారక స్థితికి చేరిన వారికి మాత్రం నీరు తాగించకూడదు. వారిని వీలైనంత త్వరగా ఆస్పత్రికి తరలించాలి

పుష్పాలంకరణలో పైడితల్లి



అమ్మవారిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు (ఇన్‌సెట్లో) ప్రత్యేక అలంకరణలో పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు మంగళవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువజామునుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ సిరిమానుపూజారి బంటుపల్లి వెంకటరావు, మూలా పాపారావు, తాళ్లపూడి ధనుంజయ్, దూసి శివప్రసాద్‌లు శాస్త్రోక్తంగా పూజాదికాలు చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయం వెనుక ఉన్న వేప, రావిచెట్ల వద్ద దీపారాధన చేశారు. కార్యక్రమాలను ఆలయ సూపర్‌వైజర్ ఏడుకొండలు పర్యవేక్షించారు.

ముగిసిన జాతీయ స్థాయి టెక్నికల్ సింపోజియం


ముఖ్య అతిథిని సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.శ్రీకుమార్, ట్రిబుల్ ఈ విభాగాధిపతి డాక్టర్ ఎ పద్మజ


హాజరైన వివిధ కళాశాల ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు

విజయనగరం అర్బన్: జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) ప్రాంగణంలో ఇంజినీరింగ్ కళాశాల ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 'ఎక్లేటిక్-2కె23' పేరుతో రెండు రోజుల పాటు నిర్వహించిన నేషనల్ లెవెల్ టెక్నికల్ సింపోజియం మంగళవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఏపీట్రాన్స్‌కో సూపరింటెండెంట్ బి.కోటేశ్వరరావు ట్రిబుల్ ఈ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ జీవితంలో ప్రతి దాన్ని బ్యాలన్స్ చేసుకోగలిగితే ఎటువంటి పనిలోనైనా విజయాన్ని సాధించవచ్చన్నారు. సమయాన్ని నిరుపయోగం చేసుకోకూడదని ప్రతి పనిలోను రాణించే విధంగా ఉంటే కచ్చితంగా గొప్ప స్థాయికి వెళ్లగలుగుతారన్నారు.

ఈఈఈకి మంచి భవిష్యత్తు

కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.శ్రీకుమార్ మాట్లాడుతూ కష్టపడితే ఎటువంటి పనిలోనైనా విజయాన్ని సాధించవచ్చని, మనకు అందుబాటులో ఉన్న కళాశాలలను సరిగ్గా ఉపయోగించుకుంటే భవిష్యత్తులో మంచి స్థాయిని చేరుకోగలుగుతాలమన్నారు. ఈఈఈ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉందన్నారు. చదువుతోపాటు విద్యార్థులకు ప్రాక్టికల్ నాలెడ్జ్ అవసరమని అన్నారు. 'ఎక్లేటిక్-2కె23' సింపోజియం ద్వారా విజ్ఞానం మరింత మెరుగుపడతుందన్నారు. అనంతరం ముఖ్యఅతిథిని ఘనంగా సత్కరితంచారు. ట్రిబుల్‌ఈ విభాగం అధిపతి డాక్టర్ ఎ.పద్మజ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కన్వీనర్‌గా డాక్టర్ వీఎస్‌వకుళ, స్టూడెంట్స్ కో-ఆర్డినేటర్స్ పీవీఎస్ఎస్ హర్షవర్ధన్, కె.సాకేత్ రాహుల్, ఆర్.సౌమ్య కృప, కె.అంజలి వ్యవహరించారు. కార్యక్రమంలో వివిధ ఇంజినీరింగ్ కళాశాలల నుంచి వచ్చిన విద్యార్థులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

27న ఉచిత స్వయం ఉపాధి శిక్షణకు ఇంటర్వ్యూలు

రాజాం సిటీ: స్థానిక జీఎంఆర్ నైరెడ్‌లో ఉచిత స్వయం ఉపాధి శిక్షణకు ఈ నెల 27న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నామని డైరెక్టర్ కె.శశిధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన 19 నుంచి 40 సంవత్సరాల మధ్య వయసుగల నిరుద్యోగ యువతీ యువకులు ఇంటర్వ్యూకు అర్హులని పేర్కొన్నారు. స్త్రీ, పురుషులకు వేర్వేరుగా శిక్షణ ఉంటుందని తెలిపారు. పురుషులకు రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండిషనింగ్ (75 రోజులు), ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్ అండ్ ఫ్యాన్ రివైడింగ్ (50 రోజులు), సెల్‌ఫోన్ రిపేర్, సర్వీసింగ్ (30 రోజులు)లో శిక్షణ ఉంటుందన్నారు. స్త్రీలకు హోం నర్సింగ్, బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్, లేడీస్ టైలరింగ్‌లలో 30 రోజులు శిక్షణ ఇవ్వనున్నామని పేర్కొన్నారు. ఇంటర్వ్యూకు వచ్చేవారు పదో తరగతి మార్కుల లిస్టు, రేషన్, ఆధార్‌కార్డులతో హాజరు కావాలని సూచించారు. శిక్షణ కాలంలో భోజన, వసతి సదుపాయం కల్పించనున్నామన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ 8247732416, 9014716255, 9491741129, 9494952586 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

బైక్ అదుపుతప్పి విద్యార్థి మృతి


బైక్‌పై నుంచి పడిపోయిన లోకేష్


మక్కువ: మండలంలోని సన్యాసిరాజపురం గ్రామానికి చెందిన ఇంటర్‌మీడియట్ విద్యార్థి ద్విచక్రవాహనం అదుపుతప్పి రహదారిపై పడిపోవడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కోట లోకేష్(16), ద్విచక్రవాహనంపై మంగళవారం మక్కువనుంచి గ్రామానికి వెళ్తుండగా, మార్గమధ్యంలో అదుపుతప్పడంతో రహదారిపై పడిపోయాడు. తలకు తీవ్రగాయాలవడంతో అక్కడిక్కడే ప్రాణాలు విడిచాడు. విషయం తెలుసుకున్న లోకేష్ తల్లిదండ్రులు కోట జగది, సునీతలు సంఘటనా స్థలానికి చేరుకుని కన్నీరు మున్నీరయ్యారు.

ఒడిశాలో వంగర వాసి..

దత్తిరాజేరు: మండలంలోని వంగర గ్రామానికి చెందిన గొర్రెల వ్యాపారి గెంజి రామారావు(45) ఒడిశాలో సోమవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గొర్రెల కొనుగోలుకు బొలెరో వ్యాన్‌లో ఒడిశా రాష్ట్రానికి వెళ్తుండగా వాహనం అదుపు తప్పి చెట్టును ఢీకొనడంతో రామారావు మృతిచెందగా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. మృతుడికి భార్య జయలక్ష్మి, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని మంగళవారం స్వగ్రామానికి తీసుకువస్తామని కుటుంబసభ్యులు తెలిపారు. ఇదే వాహనంలో ప్రయాణిస్తూ ప్రమాదంలో గాయపడిన సాలూరు మండలంలోని మిర్తివలస గ్రామానికి చెందిన ధనుంజయ్‌ను విశాఖలోని కేజీహెచ్ ఆస్పత్రికి తరలించారు.

పెరిగిన పాల ఉత్పత్తి

- వెన్నశాతం అధారంగా రైతుకు ధర చెల్లింపు
- జిల్లాలో పాడి పశువులు 4,90,989
- పాల ఉత్పత్తి రోజుకు 4,27,300 లీటర్లు


ఆవు పాలు తీస్తున్న రైతు


విశాఖ డెయిరీ కేంద్రం వద్ద పాలు సేకరిస్తున్న సిబ్బంది

విజయనగరం ఫోర్ట్: జిల్లాలో వ్యవసాయం తర్వాత పాడిపోషణపై రైతులు ఎక్కువగా దృష్టి పెట్టారు. వ్యవసాయంతో పాటు ప్రతి రైతు ఒకటో, రెండో ఆవులుగాని గేదెలను పెంచుతున్నాడు. వర్షాభావ పరిస్థితి వల్ల కరువు ఏర్పడితే పాలు విక్రయించుకుంటూ వచ్చే ఆదాయంతో జీవనం సాగిస్తున్నారు. వ్యవసాయం లేనివారు కూడా పాడిపశువులను పోషిస్తుండడంతో జిల్లాలో పాల ఉత్పత్తి బాగా పెరిగింది. పాడి పశువుల ద్వారా ఉత్పత్తి అయ్యే పాలను కొంతవరకు రైతులు డెయిరీలకు, పాల వ్యాపారులకు విక్రయిస్తున్నారు.

జిల్లాలో పశువుల వివరాలు

జిల్లాలో పాడి పశువులు 4,90, 989 ఉన్నాయి. వాటిలో ఆవులు 3,55, 131 కాగా గేదెలు 1,35,858 ఉన్నాయి. పాడి రైతులు ఎక్కువగా ఆవులను ఎక్కువగా పెంచుతున్నారు.

పాల ఉత్పత్తి వివరాలు

జిల్లాలో పాడి పశువుల ద్వారా రోజుకు 4,27,300 లీటర్ల పాలు ఉత్పత్తి అవుతున్నాయి. వాటిలో డెరీలు సేకరించేది 3,22,500 లీటర్లు, పాల వ్యాపారులు సేకరించేది 45,800 లీటర్లు కాగా రైతులు ఇంటి అవసరాలకు వినియోగించేది 45,800 లీటర్లు. విశాఖ, హెరిటేజ్ డెయిరీలు రైతుల నుంచి పాలు సేకరిస్తున్నాయి.

వెన్నశాతం అధారంగా పాల ధర

వెన్న శాతం ఆధారంగా డెయిరీలు పాల ధరను రైతులకు చెల్లిస్తున్నాయి. ఆవుపాలకు లీటరకు రూ.28 నుంచి రూ.35 వరకు చెల్లిస్తుండగా గేదె పాలకు రూ.50 నుంచి రూ.70 వరకు చెల్లిస్తున్నాయి. అయితే వెన్న శాతంతో సంబంధం లేకుండా పాల వ్యాపారులు రైతులు దగ్గర నుంచి ఆవు పాలు లీటరుకు రూ.25 నుంచి రూ.30, గేదె పాలు రూ. 50 నుంచి రూ.60కు కొనుగోలు చేస్తున్నారు.

రైఫిల్ షూటింగ్ పోటీల్లో అభిరామ్ సత్తా



జాతీయ రైఫిల్ షూటింగ్ పోటీల్లో పతకం అందుకుంటున్న కర్రి అభిరామ్‌రెడ్డి

విజయనగరం: జాతీయ స్థాయిలో జరిగిన రైఫిల్ షూటింగ్ పోటీల్లో విజయనగరానికి చెందిన కర్రి అభిరామ్‌రెడ్డి సత్తాచూపాడు. ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు ఢిల్లీలో జరిగిన 5వ రెవెన్యూ ఓపెన్ షూటింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో 400కు 394 పాయింట్లు సాధించి కాంస్య పతకం సాధించాడు. ప్రస్తుతం కాకినాడలోని జేఎన్‌టీయూలో ఎంబీఏ ద్వితీయ సంవత్సరం విద్యనభ్యసిస్తున్న విద్యార్థిని ఏపీ శాసనసభా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఏపీ రైఫిల్ షూటింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, జేఎన్‌టీయూ స్పోర్ట్స్ హెడ్ శ్యామ్‌కుమార్ అభినందించారు.

కత్తెర పురుగు నివారణే కీలకం


రైతులకు కత్తెరపురుగు నివారణ పద్ధతులు వివరిస్తున్న నైర వ్యవసాయ కళాశాల విద్యార్థులు

రాజాం సిటీ: మొక్కజొన్న పంటను ఆశించే కత్తెర పురుగు నివారణలో రైతులు మెలకువలు పాటించాలని నైర వ్యవసాయ కళాశాల విద్యార్థులు ఎస్.రత్నకుమారి, కె.రుషిక, జి.స్నేహలు సూచించారు. పొగిరి గ్రామ రైతులకు కత్తెర పురుగు నివారణపై అవగాహన కల్పించారు. తక్కువ పెట్టుబడితో పురుగుమందు తయారీ పద్ధతిని ప్రయోగాత్మకంగా వివరించారు. 10 కిలోల తవుడు, 2 కిలోల బెల్లంకు రెండు లీటర్లనీరు కలిపి 24 గంటల పాటు పులియబెట్టాలి. ఆ మిశ్రమానికి 100 గ్రాముల థయోడికార్స్ లేదా 80 గ్రాముల ఎమామెక్టిన్ బెంజోయేట్ మందును కలిపి సాయంత్రం సమయంలో పంటపై పిచికారీ చేస్తే కత్తెర పురుగు పూర్తిగా నివారణ అవుతుందని, అధిక దిగుబడులు వస్తాయన్నారు.

సొంత ఊరిలోనే 'ఉపాధి'

రామభద్రపురం: ఉపాధి పనులకు వేతనదారులు ఉత్సాహంగా వెళ్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సొంత ఊరిలోనే నిరుపేద కూలీలకు ఉపాధి కల్పిస్తుండడంతో పనులు వెళ్లేందుకు మొగ్గు చూపుతున్నారు. దీంతో మండలంలో ఉపాధి హామీ పనులు ఊపందుకున్నాయి. మండలంలో మొత్తం 10,581 జాబ్‌కార్డులు ఉండగా ప్రస్తుతం 6వేల మంది వేతనదారులు పనికి వెళ్తున్నట్లు ఉపాధి హామీ అధికారులు చెబుతున్నారు.


రామభద్రపురంలో ఉపాధి పనులకు ఉత్సాహంగా వెళుతున్న వేతనదారులు


వేతనదారులకు సూచనలు ఇస్తున్న ఏపీవో సుశీల

రాములోరి పెళ్లికి టీటీడీ నుంచి పట్టువస్త్రాలు


తిరుమల నుంచి రామతీర్థం చేరుకున్న నూతన పట్టువస్త్రాలు

నెల్లిమర్ల రూరల్: శ్రీరామనవమిని పురస్కరించుకొని ఈ నెల 30న రామతీర్థం పుణ్యక్షేత్రంలో జరగనున్న సీతారాముల కల్యాణ మహోత్సవానికి నూతన పట్టువస్త్రాలు సిద్ధమయ్యాయి. ఆలయ స్థానాచార్యులుగా వ్యవహరిస్తున్న గొడవర్తి నరసింహాచార్యులు తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి పట్టువస్త్రాలను ఆలయానికి మంగళవారం తీసుకువచ్చారు. అధికార లాంఛనాలతో జరగబోయే సీతారామచంద్ర స్వామి కల్యాణ మహోత్సవానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించనున్నారు.

ఈ నెల 22 నుంచి వసంత నవరాత్రి ఉత్సవాలు

శోభకృత్‌నామ చైత్రశుద్ధ పాడ్యమిను పురస్కరించుకొని ఈ నెల 22 నుంచి 31 వరకు రామతీర్థంలో వసంత నవరాత్రి ఉత్సవాలు ప్రారంభంకానున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి వేద పండితులు రామక్షేత్రానికి విచ్చేసి వైఖానస ఆగమశాస్త్రం ప్రకారం స్వామి సన్నిధిలో ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహించనున్నారు. శ్రీరామనవమి వైభవాన్ని ఉత్తరాంధ్ర జిల్లాల్లో ప్రచారం చేసేందుకు ఆలయ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.